క్లుప్తంగా

స్కిల్‌హబ్‌లలో ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్ : యువతకు స్వయం ఉపాధి కల్పనపై స్కిల్ హబ్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీయువకుల కోసం ఉద్యోగ ఉపాధి కల్పన నిమిత్తం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సుతోపాటు టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులు మూడు నెలలపాటు ఉంటుందన్నారు. 10తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారందరూ అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9381069980లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

30 మందికి కంటి అపరేషన్లు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరముండగా ఆపరేషన్లను జరిపారు. వైద్య శిబిరానికి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన 70 మంది కంటిరోగులు హాజరయ్యారు. గతంలో అపరేషన్ చేయించుకున్న 50మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులను అందజేశారు. ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కంటిసుపత్రి ఛైర్మన్ స్వరూప్‌గుప్తా, ఏపీఐబీసీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, క్లబ్‌మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటివైద్యులు సురేష్‌బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

జరియా ఫౌండేషన్ సేవలు అభినందనీయం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ : పట్టణానికి చెందిన జరియా ఫౌండేషన్ సభ్యులు సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు అన్నారు. ఆదివారం స్థానిక షాహీ షాదీఖానాలో ఫౌండేషన్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత అన్నాసలీం, జబీవుల్లాఖాన్, మల్లికార్జున, రక్తదాత సయ్యద్ అహమ్మద్, జరియా ఫౌండేషన్ అధ్యక్షుడు ఖైజర్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్పందన

పుల్లంపేట : స్పందన కార్యక్రమాన్ని నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరసింహకుమార్ తెలియజేశారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే స్పందనలో అర్జీలు సమర్పిస్తే వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

అంధకారంలో సిద్దవటం

సిద్దవటం : విద్యుత్ లేకపోవడంతో సిద్దవటం అంధకారంలో ఉంది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులు, వర్షం దాటికి మండంలోని మాధవరం–1, ఎస్.కె. ఆర్ నగర్ దళితవాడ రాముడి గుడి వద్ద విద్యుత్ స్తంభం పడిపోయి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సిద్దవటం విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర తెలిపారు.

ముగిసిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతి అందిస్తున్న నాయకులు, నిర్వాహకులు

నందలూరు(రాజంపేట) : ఎన్‌పీఎల్ 7వ సీజన్ టీ–20 టోర్నీ ఆదివారంతో ముగిసింది. నందలూరులోని క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచులో వెంకటరాజంపేట, సికిందర్ లెవన్స్ నందలూరు జట్టు తలపడగా విజేతగా వెంకటరాజంపేట జట్టు నిలిచింది. బహుమతుల ప్రధానోత్సవంలో సాయి లోకేష్, మేడా విజయశేఖర్‌రెడ్డి, జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యుడు షబ్బీర్ అహమ్మద్, బీజేపీ నేత రమేష్‌నాయుడు, డా.రాంబాబు, వైఎస్సార్‌సీపీ దళితనేత ఆర్ముగం పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులను గుర్తించి వారికి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

వేసవి దుక్కులు.. బహుళ ప్రయోజనాలు

- వేసవిలో చేసే దుక్కులతో తెగుళ్ల నివారణ
- ప్రస్తుతం ఈ పద్ధతిని విస్మరిస్తున్న రైతులు
- దుక్కుళ్లు చేసిన అనంతరం పచ్చిరొట్టను సాగు చేస్తే భూ సారం మరింత అధికం



సంబేపల్లె మండలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : భూమి సారంగా ఉంటేనే దిగుబడులు బాగుంటాయి. వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన రైతులు వేసవిలో ఆయా పొలాల్లో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసేవారు. ఆధునిక సమాజంలో భూములను పిండి దిగుబడులు తీసుకోవడానికే చాలా మంది చూస్తున్నారు కానీ, భూసారాన్ని వృద్ధి చేయడానికి ప్రయత్నించడం లేదు. వేసవిలో పొలాల్లో దుక్కులు చేపట్టడం వలన బహుళ ప్రయోజనాలున్న సంగతిని విస్మరిస్తున్నారు. కానీ వ్యవసాయంపై మక్కువ, ఆసక్తి ఉన్న రైతులు తమ పూర్వీకుల పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.

అనువుగా పొలాలు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాలు కాస్త తడిచి, వేసవి దుక్కులు చేపట్టేందుకు అనువుగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేసే పొలాల్లో వేసవి దుక్కులు వేయడం ఎంతో లాభదాయకమని పూర్వీకులు అనేవారు. దానిని ఆచరించేవారు. కాలక్రమంలో అన్నదాతలు ఆధునికత పేరుతో బిజీ అయిపోయి వేసవి దుక్కులు చాలా వరకు చేయడం మానేశారు. పలు గ్రామాల్లో రైతులు ప్రస్తుతం కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ తమ పొలాల్లో వేసవిదుక్కులు వేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల గడ్డి నశించిపోవడంతో పాటు వరిమళ్లు ఉళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారుతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని, తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు ఎండలకు చనిపోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తరువాత సాగుచేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు.
- రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూ సారాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఎంతో అవసరం



పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే భూమిలో సారం కరిగిపోయి నిస్సారంగా తయారవుతాయి. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులను చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తరువాత ఆపరాలు సాగు చేసే భూములలో కాకుండా ఖాళీగా ఉంచిన పొలాల్లో వేసవి దుక్కులు చేయడం పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. ఈ విధంగా చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు బాగుంటాయి.

\- వెంకటరమణ, రైతు, ఎస్.సోమవరం, సంబేపల్లె

లోతు దుక్కులు సాగుకు మేలు



ఖరీఫ్‌కు ముందు లోతుగా దుక్కులు దున్ని భూమిని చదునుపరచాలి. ఈ విధంగా సాగు చేయడం ఎంతో మేలు. ప్రస్తుతం మండలానికి 1710 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలకు 1165 క్వింటాళ్ల విత్తనకాయలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వియోగం చేసుకోవాలని కోరుతున్నాం. రైతులు పంట సాగు చేసే ముందు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

\- వెంకటరామాంజులరెడ్డి, మండల వ్యవసాయాధికారి, సంబేపల్లె

విత్తన పంపిణీ పకడ్బందీగా చేయండి



రైతులకు విత్తనాలు అందిస్తున్న గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : రైతన్నకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం నిలిచిందని, వేరుశనగ విత్తన పంపిణీ పకడ్బందీగా చేయాలని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుద్దమళ్ల గ్రామం యర్రంరెడ్డిగారి పల్లె రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో నాణ్యమైన, నమ్మదగిన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగానే అందిస్తున్నారన్నారు.

2న ఊటీకి బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. జూన్ 2న రాత్రి 8 గంటలకు డిపో నుంచి బయలుదేరి బెంగుళూరు, మైసూర్ మీదుగా 3న ఉదయం ఊటీకి చేరుతుందన్నారు. 4న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకార షూటింగ్ స్పాట్, మైసూర్ ప్యాలెస్, జూ పార్కు, బృందావన్ గార్డెన్స్ చూసుకున్న తర్వాత అదే రోజు రాత్రి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను పోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా మానవత సంస్థ



పలువురిని సన్మానించిన మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : సమాజ సేవే లక్ష్యంగా మానవత సంస్థ పని చేస్తోందని అన్నమయ్య జిల్లా టూరిజం అధికారి నాగభూషణం అన్నారు. ఆదివారం రాయచోటి ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణలో మానవత రాయచోటి శాఖ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అధ్యక్షతన మానవత స్వచ్ఛంద సంస్థ నెలవారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం మోపురం పల్లెకు చెందిన దొరబాబు అనే ఆదర్శ రైతును సన్మానించడంతోపాటు రూ.5,116ల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం విదేశీ పర్యటనకు వెళుతున్న సంస్థ మాజీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, జిల్లా డైరెక్టర్ ఆనందరెడ్డి, గౌరవ సలహాదారుడు లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు సభ్యుల సహకారం తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె : మానవత ఆశయాలు, సేవా కార్యక్రమాలకు సభ్యుల సహకారం తప్పనిసరి అని మానవత చైర్మన్ ఎస్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం సంస్థ నెలవారీ సమావేశంలో చైర్మన్ బాల సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి మానవత సేవలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవత శాఖ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉచిత బాడీ ఫ్రీజర్, శాంతిరథం, రాయచోటి వారి సహాయంతో అంబులెన్సు, ప్రతిభ కల్గిన విద్యార్థులకు రూ.25 వేలు నగదు ఇవ్వడంతోపాటు ప్రజలకు అనేక సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఆరే శివయ్య, జిల్లా డైరెక్టర్ సామాల నరసింహారెడ్డి, టి.రవీంద్ర, వి.రాజారెడ్డి, వీవీ రమణరావు, ఎ.సుబ్బారెడ్డి, రక్తనిధి పక్కిరయ్య, ఎ.రామచంద్ర బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఆహారపొట్లాల పంపిణీ

చిట్వేలి : యండల కేంద్రంలో నివాసముండే ముని సుబ్బయ్య భార్య కుమారి 3వ వర్ధంతి సందర్భంగా పేదలు, యాచకులకు ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. మరో కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి



మొక్కలు నాటుతున్న పాత్రికేయులు

సిద్దవటం : పచ్చదనాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దవటం అటవీ శాఖ రేంజర్ ప్రసాద్ తెలిపారు. సిద్దవటం గ్రామ శివారులో ఉన్న కపర్దీశ్వర కోన సమీపంలోని అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద ఆదివారం జిల్లా ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి ఆదేశాల మేరకు రేంజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పాత్రికేయులు మొక్కలు నాటారు.

రైతన్నలకు అండ 'వైఎస్సార్ రైతు భరోసా'



గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రైతులకు కొండంత అండగా వైఎస్సార్ రైతు భరోసా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య రాయచోటి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ప్లీనరీలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి దన్నుగా ఉండేందుకు తన మ్యానిఫెస్టోలో పెట్టుబడి నిధి కింద నాలుగు సంవత్సరాలకు ఏటా ప్రతి రైతుకు రూ.12,500లు చొప్పున రూ.50 వేలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల తరువాత రైతు సంక్షేమం దృష్ట్యా రూ.12,500లను రూ.13500కు పెంచి ఐదేళ్లపాటు అందించాలని నిర్ణయించారన్నారు. ఇప్పటికీ నాలుగేళ్లకుగాను రైతుల ఖాతాలలో నేరుగా రూ.54 వేలు జమచేశారని పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభం అవుతున్నందున ఈనెల 30న రైతుల ఖాతాల్లో రూ.5500 జమ కానుందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 39,539 మంది రైతులకు రూ.21.74 కోట్లు జమ కానుందని తెలిపారు. నియోజకవర్గంలో గత నాలుగేళ్లల్లో రూ.200లు కోట్లు పెట్టుబడి నిధి కింద సాయం అందించామన్నారు. తుఫాను వచ్చిన సమయంలో నష్టపరిహారంగా రూ.50 కోట్లు రైతులకు జమ చేశామన్నారు. చెప్పింది చెప్పినట్లుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసి నిరూపించారని కొనియాడారు. ఖరీఫ్‌లో ఏ పంట సాగుచేసినా రైతులు మంచి లాభాలు ఆర్జించాలని ప్రార్థిస్తున్నామని తెలియజేశారు.

బీసీల రక్షణకు అట్రాసిటీ అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ నేత మల్లికార్జున

గాలివీడు : బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అట్రాసిటీ చట్టాన్ని అమలు పరచేలా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం గాలివీడులో ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతిని సహించలేని కొందరు అగ్రవర్ణాల వారు బీసీలపై దాడులకు తెగబడటం, బీసీలను ఆత్మరక్షణలో పడవేసిందన్నారు. ఇలాంటి తరుణంలో ఎస్సీ, ఎస్టీ చట్టం తరహాలో అట్రాసిటీ చట్టాన్ని బీసీల కులాల వారికి కూడా వర్తింపజేసేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో శిక్షణా తరగతులు



రైల్వేకోడూరు అర్బన్: శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులకు ఆదివారం 25 మంది విద్యార్థులు హాజరైనట్టు గ్రంథాలయ నిర్వాహకుడు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు కథల పఠనం, నీతి కథలు చెప్పించామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ, బిస్కెట్స్ అందిచామని చెప్పారు.

కథలు కథనాలపై..

రైల్వేకోడూరు అర్బన్ : గ్రంథాలయ వేసవి శిబిరాలలో భాగంగా స్థానిక గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం కథలు, కథనాలతోపాటు, క్యారమ్స్, చెస్ ఆటలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి శిబిరాలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సెలవు దినాలలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని తెలిపారు. ఎందరో మేధావులు గ్రంథాలయాల నుంచే ఎదిగారని తెలిపారు.

మదిలో 'పది'లమైన జ్ఞాపకాలు



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో చిన్ననాటి స్నేహితులు

రాజంపేట టౌన్ : సృష్టిలో వెలకట్టలేనివాటిల్లో స్నేహం ఒకటి. చిన్ననాటి స్నేహాలు మాత్రం మరుపులేని మధురమైన అనుభూతితోపాటు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఈ కారణంగా ఇప్పుడు అనేక మంది తాము చదువుకున్న విద్యాసంస్థల్లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటున్నారు. కాగా 1982–83వ సంవత్సరంలో రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. దాదాపు ఏడాది పాటు పూర్వ విద్యార్థులైన నటకల హరి, అబ్బిగారి అన్నపూర్ణ, ఆప్కో మధు, సువర్ణకుమార్‌లు చిన్ననాటి స్నేహితులను కలుసుకునేందుకు చేసిన విశేష కృషికి వారు చదుకున్న పాఠశాలనే ఆదివారం వేదికైంది. పాఠశాలలో ఆనంద భరిత క్షణాలు కనిపించాయి. ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన చప్పిడి సత్యనారాయణరెడ్డి, గుత్రంకొండ లక్ష్మినరసయ్య, రాజగోపాల్‌నాయుడులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అంతకుముందు తమ నుంచి దూరమైన స్నేహితులు, ఉపాధ్యాయుల జ్ఞాపకార్థంగా వారు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉల్లాసంగా గడిపిన స్నేహితులు సాయంత్రం బరువెక్కిన హృదయాలతో ఇంటికి బయలుదేరారు.

శుభాకాంక్షలు



డీఓపీ జల్లాను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

గాలివీడు : రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీఓపీ) జల్లా సుదర్శన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. గత బుధవారం విజయవాడలో పదవీ బాధ్యతలు చేపట్టి ఆదివారం స్వగ్రామమైన నూలివీడుకు విచ్చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌మొద్దీన్, కేశవరెడ్డి, తదితరులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. సుదర్శన్‌రెడ్డి భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం సుండుపల్లెలో అనారోగ్యంతో మృతి చెందిన ఏరుకుల శ్రీనువాసుల కుటుంబాన్ని ఎమ్మెల్యే వారికి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులు అనారోగ్యంతో చికిత్స నిమిత్తం అయిన ఖర్చును సీఎం సహాయనిధి నుంచి సాయం చేయాలని వారి భార్య రాధిక విన్నవించగా, రూ.2లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించామన్నారు. చెక్కును ఆమెకు అందచేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇస్మాయిల్, ఎంపీపీ రాజమ్మ, మంత్రి శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామస్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రహిమాన్ ఖాన్, సింగల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆనందరెడ్డి, రహీం, కరీంబాషా, పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయండి

చిట్వేలి : మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని అంకాలమ్మ ఎస్టీ కాలనీకి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని కాలనీ వాసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గ్రామస్తులు మాట్లాడుతూ కాలనీలో సుమారు 50 మంది చిన్నపిల్లలున్నారని, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే 4 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైభవంగా ఆలయాల్లో అమ్మవారికి పూజలు



సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



పెనగలూరు: పూజలందుకుంటున్న మహంకాళమ్మ

పెనగలూరు : మండలంలోని బెస్తపల్లెలో ఉజ్జయిని మహంకాళమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి జాతర ప్రారంభమవ్వగా, మొదటగా మహంకాళమ్మ ఉత్సవ విగ్రహాన్ని గ్రామం పొలిమేర వద్దకు తీసుకెళ్లి అక్కడ పూజలు నిర్వహించి అక్కడ నుంచి పురవీధులలో ముద్దపెట్టుకుంటూ ఆలయానికి తీసుకువచ్చారు.

ఎల్లమ్మతల్లి పొంగళ్లు

మండల కేంద్రంలో ఆదివారం ఎల్లమ్మతల్లి పొంగుబాలు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కులాలకతీతంగా అమ్మవారికి పొంగుబాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందువైపున 7 రకాల రంగులతో ఎల్లమ్మ ప్రతిమను ఆషాదులు ఏర్పాటు చేశారు.

నల్ల గంగమ్మ ఆలయంలో


సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

పుల్లంపేట : అనంతంపల్లెలో వెలసిన సత్యమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండలు అధికంగా ఉండటంతో గ్రామస్తులు అమ్మవారికి 108 బిందెలు నీరుపోశారు. వరుణదేవుడు కరుణించాలని గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివారం సాయంత్రం వరుణదేవుడు కరుణించి చల్లగాలులు, కొద్దిపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

కూర్నుతల గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని బొమ్మవరంలో ఆదివారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గద్దం చెంగల్ రాయుడు అమ్మవారికి పొంగుబాలు సమర్పించారు. అనంతరం చాంధీని బండిని ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.



ఓబులవారిపల్లె: గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సంతాన వేణుగోపాలుడు.. ఉత్సవ శోభితుడు

నేటి నుంచి పది రోజులపాటు వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



పెనగలూరులోని వేణుగోపాల స్వామి ఆలయం



స్వామి వారి మూలవిరాట్

పెనగలూరు : మండల కేంద్రంలో వెలసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు పదిరోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. 29న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, మొదటిరోజు వర్తక సంఘం వారు ఉభయదాతగా వ్యవహరించనున్నారు.

30న వడ్డె సంఘం ఆధ్వర్యంలో ధ్వజారోహణం, 31న నాయుడు సంఘం ఆధ్వర్యంలో శేష వాహన సేవ, జూన్ 1వ తేదీన పంచేటి వారిచే సింహ వాహన సేవ, 2న రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హనుమద్ వాహన సేవ, 3న ముదిరాజ్ సంఘం వారిచే గరుడసేవ, 4న గానేని ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, 5న బలిజసంఘం వారిచే రథోత్సవం, 6న ఆర్యవైశ్య సంఘం వారి అలకలదోపు, 7న వసంతోత్సవం పోలిశెట్టివారు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ రాత్రి హరికథా కార్యక్రమం చేపట్టనున్నారు. పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

13వ శతాబ్దం నాటి పొత్తపిరాజు మట్లి వెంకటభూపతిరాజు హయాంలో ఈ వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం పక్కనే కన్యకల చెరువు ఉంది. అప్పట్లో ఈ చెరువును ఎన్నిసార్లు నిర్మించినా తెగిపోతూ ఉండేది. మట్లి వెంకటభూపతి రాజు చెరువు వద్దకు వచ్చి పరిశీలించగా ఆయనకు స్వప్నంలో చెరువుకట్ట మూలవైపున వేణుగోపాలస్వామి ఉన్నాడని, అక్కడ ఆలయం నిర్మిస్తే ఈ చెరువు నిలబడుతుందని తెలుపగా ఆలయాన్ని నిర్మించడంతో చెరువుకట్ట నిలబడిందని బోగట్టా. సంతానం లేని వారికి వేణుగోపాలస్వామిని పూజిస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందుకే అధికంగా వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు జరుపుకుంటుంటారు. అందుకే ఈ స్వామికి సంతాన వేణుగోపాలస్వామి అని భక్తులు పిలుస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి



పదిరోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయంలో ఏర్పాట్లు చేశాం. అలాగే ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బందులు లేకుండా ఆలయం ముందువైపున భక్తులు కూర్చునేందుకు సదుపాయాలు పొందుపరుస్తున్నాం. భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని విజయవంతం చేసి స్వామి వారి కృపను పొందాలి.

\- పంచేటి సుబ్బారెడ్డి, ఆలయ చైర్మన్, పెనగలూరు